# బిజి బిజి బిజి

–మంగళ కందూర్,

(రెండేళ్ళ క్రితం ఆర్య వైశ్య మహిళామండలి వార్షికోత్సవంలో నేను ప్రదర్శించిన ఈ బహుపాత్రాభినయం సభికులను ఎంతగానో ఆనందపరిచింది.)

అబ్బ! ఈ వేళ పనులన్నీ అయ్యాయి ఒగంట సేపు ఏదైనా చేసుకోవచ్చు. ఏదైనా ఎందుకు? పోయిన సంవత్సరం మహిళా మండలివారు నిర్వహించిన కుట్ల పోటీకని ప్రారంభించిన ఈ టి.వి. కవర్ పూర్తి అవనే లేదు. ఈ సంవత్సరం జరిగే పోటీకైనా దీన్ని ముగించాలి. అబ్బబ్బ... అవసరానికి కనిపించవు కద ఈ కళ్ళద్దాలు. ఎక్కడని వెతకను? పని సందడిలో ఎక్కడో పెట్టివుంటాను. పోనిద్దూ, అవిలేనంత మాత్రాన కుట్టలేనా ఏమిటి? అయ్యో! సూదిలో దారం ఎక్కటమే లేదు. ఎలాగబ్బా! 5 నిముషాలనుండి ప్రయత్నిస్తున్నా ఎక్కించలేక పోతున్నా. ఎవరినైనా అడుగుదామన్నా ఇంట్లో ఎవరూ లేరు. ఆ... వుండిమాత్రం ఏం చేస్తారు? క్రితం ఏడాది జరిగినది ఫ్లాష్ బ్యాక్‌లో కెళ్ళి గుర్తు చేసుకొందామా?

ఇదిగో, అప్పుడు కూడా ఇలాంటి అవస్తే కలిగింది. అయితే ఇంట్లో అందరూ వున్నారు. సాయంత్రం నాలుగవుతోంది అప్పుడు. పెద్దకోడలు కోమలిని పిలిచా. 'అమ్మాయి సూదిలో కాస్త ఈ దారం ఎక్కించి పెట్ట'మని. అంతే! పరుగులాంటి నడకతో చీర సద్దుకుంటూ హడావిడిగ వచ్చింది రుసరుసలాడుతూ. 'ప్రొద్దుటి నుంచి సతమతమవుతున్నా, సాయంత్రం మా క్లబ్బులో జరిగే ఈ ఫంక్షన్‌కని. అన్నింటికీ నన్నే పిలుస్తారు మీరు. సారీ నేను వెళ్తున్నా' నంటూ భుజానికి బ్యాగు, చేతిలో గొడుగుతో హైహీల్సుని టకటకలాడిస్తూ వెళ్ళిపోయింది. ఇంతా చేస్తే ఈవిడ వెళ్ళేటప్పటికి క్లబ్ గేట్ తాళం కూడ తీసి వుంచరు. దానికోసం ప్యూనును నాలుగు మాటలంటే, వాడు తిరిగి నాలుగు మాటలు అనే తీస్తాడు తాళం. తీరా చూస్తే అరగంట పైగా వెయిట్ చేస్తేగాని ఎవరూ రారు. ఈ మాత్రం దానికి ఒక్షణం దారం సూదిలో ఎక్కిస్తే ఏంపోయిందట!

రెండవకోడలు రేవతిని పిలిచా ఇలా వచ్చి కాస్త చేసిపెట్టమని. 'ఇదిగోనంది అత్తయ్యా వచ్చేస్తున్నా, ఈనాలుగు పేజీలు చదివి' అని నామాట పూర్తి కాకుండానే నమ్రతగ జవాబు ఇస్తుందేకాని ఎంతకూరాదు. లెండింగ్ లైబ్రరీ నుండి రోజుకో నవల అద్దెకు తెచ్చుకుని, అవి పూర్తి చేయాలని అవస్తపడుతూ, ఎవరేం అడిగినా ఇదుగో అంటుందేకాని ఒక్క అంగుళం కూడ కదలదు. ఇక ఈ నవలారాణి ఉపయోగం లేదని టి.వి. చూస్తున్న కూతురు కృష్ణశ్రీను పిలిచాను 'అమ్మాయి!' అంటూ.

కృష్ణకుమారి అనే అందమైన పేరులోని కుమారిని తుంచి 'శ్రీ'ను అతికించి, మాకంతా తనను కృష్ణశ్రీ అని పిలవాలని ఆర్డరేసింది. నా పిలుపుకు సుడిగాలిలా దూసుకొచ్చింది. 'మమ్మీ! నివిప్పుడు ఆ ఎంబ్రాయిడరీ చేయకపోతే ఏమిటట? మా ప్రాణాలు తీసికుడ్తే ఆ వచ్చే ప్రైజుకై నీకెందుకింత తాపత్రయం. ఆ ప్రైజేదో నేనే ఇస్తాగాని, నన్ను విసిగించకు, డిస్టర్బ్ చేసి' అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది. ఆ ఎమ్.టి.వి.లో వచ్చే ర్యాప్, రాక్, ట్యాప్ మ్యూజిక్ వింటూ డాన్స్ చేయటమే దాని పని. (ఆమధ్య మైకెల్ జాక్సన్ ఇండియా రావడం లేదని తెలిసి, వారం రోజులు తిండి, నిద్ర మాని ఇంట్లో ఎవరో చనిపోయినంతగ విచారించింది) ఏం చేయాలా అని చుట్టూ చూసిన నాకు 10 ఏళ్ళ నామనుమడు హోమ్‌వర్కు చేస్తూ కనిపించాడు. 'ఒరే నానీ! ఇలా వచ్చి ఈ కాస్త సాయం చేసి పెట్టరా నాన్నా' అని అడిగా. 'ఏంటి నానమ్మా అన్నీ నాకే చెబుతావు. నేను చదువుకొంటున్నా చూళ్ళేదా' మళ్ళా ఏం అనుకొన్నాడో గాని, 'పోనీలే నా హోమ్‌వర్కు నీవు చేస్తే, నీ పని నేను చేసిపెడ్తా'నన్నాడు. 'తప్పమ్మా నేను చేస్తే నీకెలా వస్తుంది చెప్పు' అన్నా నచ్చచెప్పే ధోరణిలో. 'అలాగయితే నేను దారం ఎక్కించి ఇస్తే నీకెలా వస్తుంది చెప్పు, తప్పమ్మా' అంటూ నన్ను అనుకరించాడు. వెధవకానా నా మాటలు నాకే అప్పచెబుతావా'? ' పోనీలే బామ్మా నీపని చేసిపెడ్తా మరి నాకు ఐదు రూపాయలు ఇస్తావా చెప్పు'. వీడికి ప్రతి పనికీ 5రూ. ఇవ్వాలి. బాగా నేర్చుకున్నాడు. త్రాగటానికి గ్లాసులో నీళ్ళు తెమ్మన్నా, పోస్ట్‌బాక్స్‌లో ఉత్తరాలు తెమ్మన్నా, రింగ్ అవుతున్న ఫోన్ ఎత్తమన్నా, కాలింగ్ బెల్ కొట్టిందెవరో చూడమన్నా... ఇలా ప్రతీ దానికీ 5రూ. లు ఇస్తుంటే రోజుకు పాతిక రూపాయలు ఊష్ కాకి అంటాయి.

5ఏళ్ళ మనుమరాలు బొమ్మలతో ఆడుకొంటోంది. పోనీ దీన్ని అడిగితే... ఆమాత్రం చేయక పోతుందా అని ఆశపడ్డా. రోజూ దానికి స్నానం చేయించి, అలంకరిస్తున్నా కద, ఆమాత్రం చేయదా అనే నమ్మకంతో అడిగా. 'బుజ్జితల్లీ, కాస్త సూదిలో దారం ఎక్కించి ఇయ్యవే' అని. 'మంచిదానివే బామ్మ. నేను బొమ్మకు డ్రెస్ కుడ్తున్నా కనపళ్ళేదా? నేను బిజీ మరి'. అంది ఆరిందాలా. 'సరే అయితే నా బొమ్మకు డ్రెస్ నీవు కుట్టి పెడ్తావా నీ పని నేను చేస్తా'. దీని లిటిగేషన్ తగలడా, నాకే నేర్పుతుంది. అదే చేతనయితే ఇలా అందరినీ ఎందుకు బ్రతిమాలాడాను?

ఇంతలో పనిమనిషి రత్తి పరుగెడుతిన్నట్టుగ గబగబ వెడుతోంది. 'ఒసే రత్తీ! ఒ సెంకెండ్ ఇలారా' అని పిలిచా 'ఏమిటి పెద్దమ్మగారూ, ఇంత దాకా ఇంట్లో చాకిరీ. ఇప్పుడు మీ సేవ అంటే ఎలాగు? అవతల నాకు టేమ్ అయింది'. 'ఎక్కడికే వెళ్ళేది' అడిగా లాలనగా. 'మా చిరంజీవి సినిమా ఇవాళ ఆఖరు రోజు. దానికెళ్ళాలి'. 'అదేంటే దాన్ని ఎన్నోసార్లు చూశానన్నావు కదా! ఇదెంతపని. ఒక్షణం దారం ఎక్కిస్తే ఏం టైం అవుతుందట. 'ఆ... మంచోరే లెండి పదిమార్లు చూశా. అయితే ఏమిటట? వందసార్లు చూసినా మా 'చిరు' సినిమా విసుగనిపించదు. మొదట్లోనే మంచి పాట, డేన్సు వున్నాయి. ఏం టెప్పులనీ ఆహా!' తన్మయం పొందుతోంది. ఇంతసేపు ఆ చిరంజీవి గురించి చెబితే 'టేము' అవదుగాని, నాకో సెకెండు పని చేసి పెడ్తే 'టెప్పుల డాన్స్' మిస్ అవుతుందట! 'ఒ పది రూపాయలు ఇవ్వండి మీ పని చేసి, ఆ డబ్బుతో టికెట్ కొని, మీ పేరు చెప్పుకొని సినిమా చూస్తా'నంది. బాగుంది వీరందరికీ నేనెక్కడ లంచమిచ్చేది. 'నీవు వెళ్ళు తల్లీ, లేకపోతే మీ 'చిరు' టెప్పులు వేయడేమో' అని దాన్ని సాగనంపాను. ఛీ... ఛీ... ఈ టి.వి.లు, సినిమాలు, వి.సి.ఆర్‌లు, కేబుల్ టి.వి., స్టార్ టి.వి.లు వచ్చి జనాల్ని సోమరిపోతుల్లా చేస్తున్నాయి.

అప్పుడే స్కూటరు దిగి పెదబ్బాయి వస్తున్నాడు లోపలికి. 'పెద్దబాబూ కాస్త ఈ పని చేసిపెట్టవూ' అని అడిగా. ఇందులో తప్పేమి వుంది చెప్పండి. గయ్‌మని లేచాడు 'ఏంటమ్మా! ఇంతసేపూ ఆఫీసులో బాసు చేయించుకున్నాడు చాకిరి. అలసిపోయి ఇంటి కొస్తే నీ సేవ. ఇలా అయితే రెస్ట్ లేక జబ్బు పడాల్సివస్తుంది'. రుస రుసలాడుతూ వెళ్ళాడు లోపలికి. ఎంత పెద్ద మాట లంటున్నాడు. తను వచ్చేటప్పటికి పెళ్ళాం ఇంట్లో లేక క్లబ్ కెళ్ళిందని వుడుకుమోత్తనం. భార్యను అనే ధైర్యం లేక నామీద విరుచుకు పడుతున్నాడు.

'హాయ్ మమ్మీ!' అంటూ టెన్నిస్ ర్యాకెట్ వూపుకొంటూ వచ్చాడు చిన్నోడు. వాడిని బ్రతిమాలాను 'చిన్నబాబూ! ఈ కాస్త దారం ఎక్కించరా' అంటూ. వాడు సీరియస్ అయిపోయాడు. 'మమ్మీ నీకు ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలీదు. ఇవాళ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో గెలిచి ఎంతో సంతోషంగా ఇంటికొస్తే, కంగ్రాట్స్ చెప్పేది పోయి వెధవపని చెబుతావా' అంటూ అదేదో నేషనల్, ఇంటర్నేషనల్ మ్యాచ్

గెలిచినంత సంబరపడి పోయాడు, లోపలికెళ్తూ 'కనీసం ఒకప్పు కాఫీ అయినా తెస్తావా?' అంటూ అభ్యర్థనో, ఆర్డరో అర్థం కాని విధంగా అడిగాడు, పెళ్ళాన్ని అడగక నన్ను అడగటమేమిటో!

హూ! ఇంతమంది వుండి ఈ చిన్నపని చేయలేకపోయారు. రేపొకవేళ జబ్బేదన్నా చేస్తే వీళ్ళేమిటి చూస్తారు? చూస్తారనుకోవడం నా అమాయకత్వం ఈవినింగ్ వాక్‌కు వెళ్ళటానికి స్లిక్‌తో తయారై వచ్చిన శ్రీవారు, చెంపమీద చెయ్యివేసుకుని వున్న నా తీరు చూసి, కారణం తెలుసుకొని, తను చేస్తానంటూ నా చేతిలోనుండి సూది, దారం అందుకొన్నారు. దగ్గరున్న తన వస్తువులే తనకు కనిపించక, నేను తీసి ఇస్తుంటా. ఈయన నాకు ఏమి సహాయం చేయగలరని అనుకొన్నా. అయినా ఏ పుట్టలో ఏ పాముందో చూద్దాం అనుకొని బాబుకు కాఫీ ఇవ్వటానికని లోనికి వెళ్ళా.

వంటకు అంతా రెడి చేసి, అరగంట తర్వాత గుర్తుకొచ్చి చూద్దును కదా, పాపం ముసలాయన సూదీ, దారంతో ఇంకా కుస్తీ పడ్తున్నారు. ఆయనను వాకింగ్‌కు వెళ్లమని చెప్పి, బయటికొచ్చి చూశా, ఎవరైనా కనిపిస్తారేమోనని. రోడ్లో అందరూ ఎవరో తరుముకొస్తున్నట్టు హడావిడిగ వెళ్తున్నారు. ఒకరిద్దరిని పిలిచిని, వారికి నా మాటలేవి వినిపించ లేదు. ఆఖరకు ఎలాగైతేనేమి ఒ అమ్మాయి నా పని చేసిపెట్టింది.

ఇక కుట్టుకోవచ్చని లోనికొస్తే గడియారం 7 గంటలు కొట్టింది. తప్పని సరిగ వంట ఇంట్లోకి వెళ్ళా. లేకపోతే చిన్న పిల్లలు భోజనం చేయకనే పడుకొంటారు. వంట అవకపోతే క్లబ్‌నుండి వచ్చిన కోడలుపిల్ల పెద్ద రాద్ధాంతం చేస్తుంది. నవలారాణి అయిన చిన్న కోడలికి ప్లేట్‌లో అన్నం తీసికెళ్ళి ఇస్తే చదువుకొంటూ తింటుంది. మగపిల్లలు ఎప్పుడో రాత్రి తింటే తింటారు, లేకపోతే బయటనే తినివస్తారు.

పోయిన సంవత్సరం అలా అయింది, ఈ సంవత్సరం అయినా పూర్తి చేద్దామని పట్టుదలగ వుంది. అయినా అదే ప్రాబ్లెం. అప్పుడు అందరూ వుండి సహాయం చేయలేదు. ఇప్పుడు ఎవరూ లేరు ఇంట్లో అంతే తేడా. రిసెల్ట్ మాత్రం ఒక్కటే. ఎవరూ అవసరానికి ఆదుకోరు. ఎక్కడ పెట్టానో. అరె ఈదేమిటి మెళ్ళో! అరె నా మతిమరపు మండా. ఎక్కడో ఇలా పెట్టి తగలెడ్తానని ఈ మధ్య చెయిన్‌కు కళ్ళ అద్దాలు కట్టి మెడలో వేసుకొన్నా. నయం ఇప్పుడైనా కనిపించింది. ఈ సంవత్సరం ఈ టి.వి. కవర్ తప్పక పూర్తి చేసి ప్రైజ్ కొట్టే దాకా వదలను. నా పట్టుదల అంటే ఏంటనుకొన్నారో!

# సారస్వత సమూహం

– వేమూరి వెంకటరామనాధం, Piscataway, NJ

మే 31, 1998న జరిగిన యీ సమావేశం సుప్రభ వ్రాసిన పద్యాలతో ప్రారంభమయింది. 'తెలుగు వారి దేశము', 'సంక్రాంతి క్రొత్త అల్లుడు', 'శంకరుడు' అన్న ఖండికలు చదివారు. శ్రీ కలశపూడి శ్రీనివాస రావు పానుగంటివారి సుప్రసిద్ధ 'సాక్షి' గ్రంథంలోని ఒక ఉపన్యాసం కొంత కొంతగా మార్చి 'తెలుగు మాట్లాడలేడుట' అన్న వ్యంగ్యవ్యాసం చదివారు. శ్రీ మస్తాన్ రెడ్డి కవిని వనమాలితో పోల్చి ఒక గేయం వినిపించారు. శ్రీచోడవరపు ప్రసాద్ కాకరకాయ – కీకరకాయ, పేటెంటులు మొదలయిన ప్రస్తుత విషయాలను కథారూపంలో చిత్రించారు. శ్రీవేమూరి వేంకటరామనాధం 'పక్షిభాష'అన్న ఆటవెలది – తేటగీతి పద్యాల ఖండికను పక్షుల చర్యలకు తాత్పర్యంనినదిస్తూ చదివారు. శ్రీబుఱ్ఱా నాగేంద్రుడు 'అమెరికా భారతంలో ప్రవాస పద్యం' అన్న చక్కని వ్యంగ కల్పనను వినిపించారు. శ్రీజనని కృష్ణ 'నేటి భారతంలో రామాయణం' అన్న శీర్షిక క్రింద ఆశువుగా రాముడు, సీత జీవిత చరిత్రను ఈనాటి సంసార, సాంఘిక పరిస్థితులకు సమానాంతరంగా విపులీకరించారు.

ఆనాటి అతిథి శ్రీఆకెళ్ళ వేంకట సూర్యనారాయగారు 'చంద్రగ్రహణము' అన్న కథను ప్రభావవంతంగా చదివారు. వీరు తెలుగు సినిమా లెన్నింటికో సంభాషణలు వ్రాసిన ప్రతిభావంతులు. కథలు, నవలలు కూడ వ్రాసినారు.

మఱొక ప్రత్యేక అతిథి శ్రీఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు. వీరు పండితవర్యులైన శ్రీహనుమచ్ఛాస్త్రిగారి పుత్రుడు. వారి ఉపన్యాస కౌశలము, సారస్వత పాండితో పల్కిన పల్కులు చెప్పనే చెప్పినాయి. శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యద'లోని అతుల్యతను నిరూపిస్తూ, సభికుల ప్రశ్న లెన్నింటికో సమాధానాలు ఇచ్చారు.

ఎప్పటివలెనే ఈ సభకూడ జిజ్ఞాసతో కూడిన సారస్వత అభిమానుల వాక్ చాతుర్యంతో ఇంపుగా ఉంది. దానికి తులతూగే రుచులుగల విందు శ్రీఅప్పాజోస్యుల సత్యనారాయణగారు, వారి సతీమణి శ్రీలక్ష్మి ఇచ్చారు. సభ్యులు చిన్న చిన్న గుంపులుగా సారస్వత విశేషాలను ఎన్నింటినో ముచ్చటించుకున్నారు– ముఖ్యంగా రచనలలో తొలి అంగలు వేస్తున్నవారు.

# వైజ్ఞానిక దేశ అభ్యుదయం

అంతులేని మానవ జిజ్ఞాస
శోధనతో చేకొంది విజ్ఞానపు ఉచ్ఛదశ
ఛాందసం, మూఢత్వం విడిచేసి సోదరా!
వైజ్ఞానిక వెలుగు బాట సాగుము మునుముందురా!
విలువైనది శాస్త్ర సాంకేతిక సంపద
మరువరాదు విజ్ఞానము వారసత్వ సంపద.
శాస్త్రాల్ని వాడాలి అందరి అభ్యుదయం కోసం
ఆలోచనతో నియంత్రించు కాలుష్యపు భూతం
ఈనాడు ప్రగతికి దేశభక్తి ఊతం
ఉద్రేకపు తీవ్రవాదమొసగునోయి క్లేశం.
రాజ్యాంగం ఒనగూర్చిన వైజ్ఞానికి దృక్పథాలు
భరత జాతి ప్రగతి కొరకు పయనించే క్రాంతి రథాలు
నవ జీవిత యుగ భావనల జన విజ్ఞాన వేదికలు
సతత హరిత భవిత కొరకు నర్తించే భారతి సిరిమువ్వలు.
విద్య వలన ఒనగూడే విలువైన ప్రయోజనం
ప్రజల మేలు కొలుపుటకది అత్యుత్తమ సాధనం.

– డా|| కాసర్ల రంగరావు, పాల్వంచ, ఇండియా

